క్లుప్తంగా

ముగిసిన చౌడేశ్వరీ దేవి జ్యోతి మహోత్సవాలు



జ్యోతులతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీ చౌడేశ్వరీ దేవీ జ్యోతి మహోత్సవాలు తొగట వీర క్షత్రియుల ఆధ్వర్యంలో శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి మూలవిరాట్‌కు విశేషపూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి 12 గంటలకు స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయం నుంచి జ్యోతి ఉత్సవాలు మేళతాళాలతో ప్రారంభమయ్యాయి. భజన పాటలతో, ఖడ్గపద్య ఆలాపనలతో జ్యోతుల ఊరేగింపు పురవీధుల గుండా సాగి అమ్మవారికి సన్నిధికి చేరుకున్నాయి. ఆలయ ప్రాంగణం వద్ద అగ్నిగుండంలో నడుస్తూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

హైవే నిర్మాణానికి భూ పరీక్షలు



80 బన్నూరు వంతెన వద్ద యంత్రాలతో డ్రిల్‌చేసి భూనమూనాలు సేకరిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: నేషనల్ హైవే 340సీ రహదారి నిర్మాణం నిమిత్తం కర్నూలు నుంచి ఆత్మకూరు వరకు కేజీ రోడ్డు వెంట ఉన్న వంతెనలు, కల్వర్టుల వద్ద అధికారులు భూపరీక్షలు చేస్తున్నారు. యంత్రాల సాయంలో భూమిలోని 150 నుంచి సుమారు 300 అడుగుల వరకు తవ్వకాలు జరిపి వాటి సమూనాలు సేకరిస్తున్నారు. ఎన్ని అడుగుల మేర భూమి పొరలు దృఢంగా ఉన్నాయనే వివరాలను తెలుసుకునేందుకు వీటి నమూనాలను ల్యాబ్‌కు పంపనున్నారు.

బెంగళూరుకు పందుల తరలింపు



పందులను పట్టుకున్న యాజమానులు

నందికొట్కూరు: పట్టణంలోని పందులను బెంగళూరుకు తరలిస్తునట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. శనివారం పట్టణంలోని సుబ్బారావుపేట, కర్నూలు రోడ్డులోని బైరెడ్డి నగర్, కాలేజీ రోడ్డు, హౌసింగ్ బోర్డు, విద్యానగర్, సాయిబాబాపేట, హాజీనగర్ తదితర ప్రాంతాల నుంచి పందులను యాజమానులే వలల ద్వారా పట్టుకున్నారు. వాటిని వారే వాహనాల్లో బెంగళూరుకు తరలించారు. కమిషనర్ మాట్లాడుతూ రాబోయే సీజన్‌లో పట్టణ ప్రజలకు అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే 426 పందులను తరలించడం జరిగిందని చెప్పారు. పట్టణానికి దూరంగా షెడ్లు వేసుకుని పందులను పెంచుకోవాలని సూచించారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

వెలుగోడు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ ఎస్వీ సుమలత శనివారం తెలిపారు. మే 08 నుంచి జూన్ 11వ తేదీ వరకు జరిగే ఈ వేసవి శిబిరంలో కథలు వినుట, పుస్తక పఠనము, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పుట, చిత్రలేఖనము, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ తదితర సృజనాత్మక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని చెప్పారు.

సాయివర్ధన్ ఎద్దుల విజయం



బండలాగుతున్న గడెపు ఎద్దు

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన గడెపు ఎద్దుల బండలాగుడు పోటీలను గ్రామ ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఈ బండలాగుడు పోటీల్లో 9 జతల ఎద్దు పాల్గొన్నట్లు నిర్వహకులు తెలిపారు. మిడుతూరు గ్రామానికి చెందిన సాయివర్ధన్ ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేలు, సి. పరమేష్ ఎద్దు రెండో స్థానంలో నిలిచి రూ. 7, ప్రణయ్ చెందిన ఎద్దు మూడో స్థానంలో నిలిచి రూ. 5వేలు ప్రవీణ్‌కు చెందిన ఎద్దు నాల్గవ స్థానంలో నిలిచి రూ. 3 వేలు నగదును గెలుచుకున్నాయి.

‘పది’లో ఆదర్శం

- పదో తరగతి ఫలితాల్లో వెలుగోడు మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ
- శ్రీశైలం జెడ్పీహై స్కూల్‌లో 90 శాతం ఉత్తీర్ణత



వెలుగోడు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 78 శాతం ఉత్తీర్ణత సాధించి ఆదర్శంగా నిలిచారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 96 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 75 మంది ఉత్తీర్ణత సాధించారు. వెలుగోడు జెడ్పీ హైస్కూల్‌లో 214 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 93 మంది ఉత్తీర్ణత సాధించారు. 43.6 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం రూతు నల్లి తెలిపారు. వేల్పనూరు జెడ్పీ హైస్కూల్‌లో 80 మంది పరీక్షలు రాయగా 31 మంది పాసై అయినట్లు 39 శాతం ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం లింగన్న తెలిపారు. రేగడగూడురు జెడ్పీ హైస్కూల్‌లో 50 మంది పరీక్షలు రాయగా 13 మంది పాస్ అయినట్లు హెచ్‌ఎం రసూల్ ఖాన్ తెలిపారు. పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో 41 మంది పరీక్షలు రాయగా 35 మంది పాస్ అయినట్లు కరస్పాండెంట్ ఎంఎఫ్ ఇమ్మానుయేలు తెలిపారు. డిపాల్ స్కూల్‌లో 49 మందికి గాను 44 మంది పాస్ అయినట్లు ప్రిన్సిపాల్ పాదర్ జైసన్ తెలిపారు. జీబీఎం స్కూల్‌లో 15 మంది పరీక్షలు రాయగా 12 మంది పాస్ అయినట్లు కరస్పాండెంట్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

శ్రీశైలం జెడ్పీస్కూల్ విద్యార్థుల ప్రతిభ

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం బి.మల్లికార్జున తెలిపారు. మొత్తం 90 మంది విద్యార్థుల్లో 81 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు.

నందికొట్కూరు మండలంలో ఫలితాలు

నందికొట్కూరు: మండలంలోని బ్రాహ్మణకొట్కూరు జెడ్పీ హైస్కూల్‌లో 99 మంది గాను 45 మంది పాసయ్యారని ఎంఈఓ ఫైజున్నీసాబేగం తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 131 మంది 77 మంది, కొణిదేల జెడ్పీ హైస్కూల్‌లో 54కు గాను 21 మంది పాస్ అయ్యారన్నారు. బిజినవేముల జెడ్పీ హైస్కూల్‌లో 25 మంది గాను 16 మంది, వడ్డేమాన్‌లో జెడ్పీ హైస్కూల్ 48 మందికి గాను 42 మంది ఉత్తీర్ణులయ్యారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల (సంతపేట)లో 35 మంది గాను 26 మంది, గవర్నమెంట్ హైస్కూల్‌లో 159 మంది గాను 58 మంది, జిల్లా పరిషత్ బాలుర కోట హైస్కూల్‌లో 25 మంది గాను 18 మంది, సీఎస్ఐ ఎయిడెడ్ పాఠశాలలో 35 మంది గాను ఐదుగురు పాస్ అయ్యారు.

కొత్తపల్లి మండలంలో 40.4శాతం ఉత్తీర్ణత

కొత్తపల్లి: మండలంలో మొత్తం 266 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 129 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలం మొత్తం ఉత్తీర్ణత శాతం 40.4 గా ఉందని ఎంఈఓ శ్రీరాములు తెలిపారు.

మహానందిలో..

మహానంది: మండలంలో పాఠశాలల వారీగా ఉత్తీర్ణత శాతం పరిశీలిస్తే.. తిమ్మాపురం జెడ్పీ పాఠశాలలో 45 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 16 మంది, గోపవరం జెడ్పీ పాఠశాలలో 86 మందికి 28 మంది, గాజులపల్లెలో 75 మందికి 27 మంది పాసైనట్లు ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు. మహానంది మండలంలో 45.2శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు చెప్పారు.

జూపాడుబంగ్లాలో తగ్గిన ఉత్తీర్ణత శాతం

జూపాడుబంగ్లా: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో ఉత్తీర్ణతశాతం భారీగా తగ్గింది. మండల విద్యాధికారి మోహన్ తెలిపిన వివరాల మేరకు పాఠశాలల వారీగా ఉత్తీర్ణత సాధించిన ఫలితాల వివరాలు ఇలా..మండలంలోని 8 ఉన్నత పాఠశాలల్లో 437మంది విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం 215 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 49 శాతం నమోదైంది. గురుకుల పాఠశాలలో 72 మందికి గాను 56మంది ఉత్తీర్ణత సాధించగా, కస్తూర్బాగాంధీ పాఠశాలలో 39 మందికి గాను 21మంది, మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30మందికి గాను 11 మంది పాసయ్యారు. కనకయ్యకొట్టాల జెడ్పీ హైస్కూల్‌లో 33 మంది విద్యార్థులకు గాను కేవలం ఆరుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, పారుమంచాల జెడ్పీహెచ్ఎస్‌లో 42 మందికి 10 మంది, తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 18 మందికి గాను 9మంది, ఏపీ మోడల్ పాఠశాలలో 96 మందికి 69 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

మెరుగ్గా ఇంగ్లిషు మీడియం ఫలితాలు

పాములపాడు: 10వ తరగతిలో విద్యార్థులు 55.12 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ బాలాజీనాయక్ తెలిపారు. శనివారం వెలువడిన ఫలితాల్లో మండలంలో తెలుగు మీడియం విద్యార్థుల కంటే ఇంగ్లిష్ మీడియం విద్యార్థులే మెరుగైన ఫలితాలు సాధించారు. తెలుగు మీడియంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 127 మంది పరీక్షలకు హాజరుకాగా 35 మంది ఉత్తీర్ణత సాధించారు. కాగా ఇంగ్లిష్ మీడియంలో 133 మంది విద్యార్థులకు గాను 78 మంది పాసయ్యారు. జెడ్పీ హెచ్ఎస్ వేంపెంటలో 46 మందికి గాను 24 మంది, జెడ్పీహెచ్ఎస్ పాములపాడు 57 మందికి గాను 14 మంది, జెడ్పీహెచ్ఎస్ లింగాల 29 మందికి గాను ఐదుగురు, జెడ్పీహెచ్ఎస్ వానాల 15 మందికి గాను 4, జెడ్పీహెచ్ఎస్ తుమ్మలూరు 21 మందికి గాను 8 మంది, ఏపీ మోడల్ స్కూలు 92 మందికి గాను 58, కేజీబీవీ 31 మందికి 10 మంది చొప్పున ఉత్తీర్ణత సాధించారు.

ఉర్దూ మీడియంలో ఉత్తమ ఫలితాలు

మిడుతూరు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ, కస్తూర్బా బాలికల విద్యాలయం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం (35.66) తగ్గిందని ఎంఈఓ మౌలాలి తెలిపారు. మండలంలో పలు పాఠశాలల్లో తెలుగు మీడియం 182 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 40 మంది విద్యార్థులు, ఆంగ్ల మాధ్యమంలో 192 మందికి 86 మంది, కడుమూరు ఉర్దూ స్కూల్‌లో 13 మందికి 12 మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. ఆదర్శ పాఠశాల ఆంగ్ల మాధ్యమంలో 95 మందికి 56 మంది విద్యార్థులు ఉతీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు.

పగిద్యాల మండలంలో 68.11 శాతం ఉత్తీర్ణత

పగిద్యాల: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 417 మంది (తెలుగు, ఇంగ్లిష్ మీడియం) బాల, బాలికలు హాజరు కాగా 284 మంది పాసై 68.11 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సుభాన్ తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు సోమవారం నుంచి ప్రత్యేక క్లాసులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పది ఫలితాల్లో 46 శాతం ఉత్తీర్ణత

బండిఆత్మకూరు : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 46 శాతం ఉత్తీర్ణత విద్యార్థులు సాధించినట్లు ఎంఈఓ కరిముల్లా తెలిపారు. మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలల్లో 409 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 190 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

బీసీ గురుకులం విద్యార్థుల ప్రతిభ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయం విద్యార్థులు పది పరీక్షల్లో ప్రతిభను చాటారు. 148 విద్యార్థులు పరీక్షలు రాయగా 133 మంది ఫస్ట్‌క్లాస్‌లో, ఆరుగురు సెకండ్‌క్లాస్‌లో, ఇద్దరు థర్డ్‌క్లాస్‌లో పాస్ అయ్యారు. గిరిజన గురుకుల పాఠశాలలో 51 మందికి గాను 29 మంది ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 22 శాతం ఉత్తీర్ణత సాధించారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు



దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఐటీఅండ్‌సీ శాఖ కార్యదర్శి కోనశశిధర్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

బండిఆత్మకూరు: ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చినట్లు ఐటీఅండ్‌సీ శాఖ కార్యదర్శి కోనశశిధర్, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. శనివారం నారాయణాపురం గ్రామంలో దెబ్బతిన్న వరిపంటను వారు పరిశీలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రబీలో సాగుచేసిన వరిపంట నేలమట్టం అయ్యింది. దీంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న కోనశశిధర్, కలెక్టర్‌లు స్వయంగా గ్రామంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించటంతో పాటు నష్టపోయిన రైతుల వివరాలు సేకరించారు. ప్రతి గ్రామంలో ఎన్ని హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయో, రైతులకు ఎంతనష్టం వాటిల్లిందో వ్యవసాయ అధికారులు లెక్కించి సమగ్ర వివరాలు పంపించాలని ఆదేశించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతుల నుంచి గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల, ఆత్మకూరు ఆర్డీఓలు శ్రీనివాసులు, ఎం దాసు, తహసీల్దార్ ఉమారాణి, ఆర్ఐ సుప్రియ, వీఆర్వో ఏసుపాదం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలి



నాగంపల్లి సొసైటీ నూతన చైర్మన్ జనార్దన్‌రెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: అధికారులు సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వమనడం భావ్యం కాదని, అర్జీలు ఇవ్వడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేయడంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయాని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ కుసుమలత ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖ అధికారులు వారి శాఖలపరిధిలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు వారి పరిధిలోని గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా సమావేశం మధ్యలోనే పలుశాఖల అధికారులు భవనం నుంచి లోపలికి, బయటికి తిరుగుతూ ఉండగా ఎంపీడీఓ మేరి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సమావేశం అధికారులు వచ్చారు చదివారు వెళ్లారు అన్నట్లు తూతూ మంత్రంగా జరిగింది. అనంతరం వైస్ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, ఎంపీపీ కుసుమలత, ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌లు నాగంపల్లి సొసైటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన గౌరు జనార్దన్‌రెడ్డిని పూలమాలతో సన్మానించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ యశస్విని

మహానంది: గ్రామాల్లోని ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని సూచించారు. బుక్కాపురం మహిళాసమాఖ్య కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సమస్యలను గుర్తించి వెంటనే వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్య పనులపై దృష్టి సారించాలన్నారు. అకాలవర్షాలు, గాలులకు దెబ్బతిన్నపంటలను పరిశీలించి నివేదికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర రెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా పారువేట ఉత్సవం



ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకెళ్తున్న దృశ్యం

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలోని ఈశ్వరస్వామి తిరునాల సందర్భంగా నాల్గవరోజు శనివారం పారువేట ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రీ, గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులతో కలసి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పూలమాలలు, నూతన వస్త్రాలతో అలంకరించి విశేషపూజలు చేశారు. అనంతరం విగ్రహాలను పల్లకీలో ఆశీనులు గావించి గ్రామంలో ఊరేగించారు. ఉత్సవమూర్తులను ఊరిబయటకు తీసువెళ్లి అక్కడ పారువేట ఉత్సవాన్ని ప్రారంభించారు. పారువేట గొర్రె తోకను కోసి విడిచి పెట్టారు. పారువేట గొర్రె పరుగెత్తుతుండగా సుమారు వంద మంది యువకులు దాని వెంట పరుగెత్తి పట్టుకునేందుకు ప్రయత్నించారు. చివరకు గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన శివుడు అనే వ్యక్తి పారువేట గొర్రెను పట్టుకున్నాడు. అతన్ని గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా పారువేట ఉత్సవం

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం పారువేట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి స్వామివార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై పారువేట మండపం వద్దకు మేళతాళాలతో చేరుకున్నారు. ఉత్సవమూర్తులను పారువేట మండపం వద్ద ఆశీనులను చేసి ఆనవాయితీ మేరకు గొర్రెను తోక కోసి పారువేటకు వదిలారు. అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులను గజవాహనంపై ఆశీనులను చేసి మేళతాళాలతో ఊరేగింపుగా గ్రామంలోకి చేరుకొని గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన పోలీసులు, గ్రామపెద్దలకు అందరికీ ఈఓ గుర్రెడ్డి అభినందనలు తెలిపారు.



గజవాహనంపై లక్ష్మీచెన్నకేశవస్వామి

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెలుగోడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి (2023–24) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నాణ్యమైన ఉచిత విద్య, ఆంగ్ల మాధ్యమంలో 6 నుంచి ఇంటర్ వరకు చదవడానికి, వెలుగోడు మండలంలోని 5వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు httpr.apmr.ap.gov.in/apmr, httpr://apmr.ap.gov.in/apmr(ఆన్‌లైన్)లో అప్లై చేసుకోవాలని సూచించారు. జూన్ 11వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 9వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అప్లై చేసుకోవాన్నారు. . అనంతరం డాక్యుమెంట్లు వెలుగోడు మోడల్ స్కూల్ ఆఫీస్ రూంలో సమర్పించాలని సూచించారు. వివరాలకు ప్రిన్సిపాల్ సెల్ నంబర్: 7032996490 సంప్రదించాలని సూచించారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులు ఉచితంగా విద్యనభ్యసించేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ బాలాజీనాయక్ కోరారు. శనివారం స్థానిక ఎమ్మార్సీలో విలేకరులతో మాట్లాడుతూ 25శాతం ఉచిత సీట్లకు ఈ నెల 15 వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

నందికొట్కూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కళాశాలలో గ్రంథాలయంలో గెస్ట్ లైబ్రేరియన్ ఉద్యోగానికి తగిన అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతునట్లు చెప్పారు. ఈ ఉద్యోగానికి కనీస అర్హత 55 శాతం మార్కులతో ఎంఎల్ఐఎస్‌సీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్నీ వివరాల కోసం సెల్ 97040 58507 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

120 ఎకరాల్లో పంటనష్టం



అరటి పంటను పరిశీలిస్తున్న హెచ్ఓ శ్రీధర్

మహానంది: అకాల వర్షాలకు అరటి పంటలకు నష్టం వాటిల్లినటు జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు తెలిపారు. గోపవరం, బుక్కాపురం గ్రామాల పరిధిలో నష్టపోయిన అరటి పంటలను శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల పరిధిలో 120 ఎకరాల్లో అరటి పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ఉద్యానశాఖ అధికారి శ్రీధర్, సిబ్బంది హరిత, తదితరులు నష్టపోయిన రైతుల పంటలను సందర్శించి పూర్తి స్థాయిలో నివేదికలు రూపొందిస్తున్నారన్నారు.

త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలి

జూపాడుబంగ్లా: ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా పక్కాగృహాలు నిర్మించుకోవాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, ఈఓపీఆర్డీ మణిమంజరి, ఏపీఎం అంబమ్మ సూచించారు. శనివారం మండ్లెం జగనన్న కాలనీని పరిశీలించారు.

మిడుతూరు: ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని లబ్ధిదారులకు ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్ సూచించారు. శనివారం స్థానిక జగనన్న కాలనీ లే అవుట్లను పరిశీలించారు.

పగిద్యాల: నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంతో సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. శనివారం పగిద్యాల సచివాలయం- 2 పరిధిలోని జగనన్న లే అవుట్ కాలనీలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఏ కోడూరులో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

బండిఆత్మకూరు: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఏ కోడూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, సహకార సంఘం చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రజల కష్ట సుఖాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారికి అందుతున్న పథకాల వివరాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నారన్నారు. రైతులు, విద్యార్థులు, కార్మికులకు పలురకాల సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. తద్వారా పేదవారు ఆర్థికంగా వృద్ధిచెందేలా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, నాగరాజు, శ్రీరామరెడ్డి, బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, చెన్నారెడ్డి, పరమటూరు సహకార సొసైటీ చైర్మన్ శివలింగం, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

గురుకులంలో మౌలిక వసతులపై తనిఖీ



ప్రత్యేకాధికారి ఎంఎస్‌వీ రాజుకు పాఠశాల స్థితిగతులను వివరిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి

జూపాడుబంగ్లా: కలెక్టర్ ఆదేశాల మేరకు జూపాడు బంగ్లా గురుకుల పాఠశాల, ఎస్సీ బాలికల హాస్టల్లోని మౌలిక వసతులపై శనివారం స్పోర్ట్స్ డెవలప్‌మెంటు అధికారి ఎంఎస్‌వీ రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గురుకుల పాఠశాల, ఎస్సీ బాలికల హాస్టల్లోని తాగునీరు, టాయ్‌లెట్లు, తరగతి గదులు, డార్మిటరి, డెస్కులు, డైనింగ్‌హాల్, పరిసరాలను పరిశీలించారు. గురుకుల పాఠశాలలో డార్మిటరీ గదుల తలుపులు, కిటికీలు ధ్వంసమై ఉండటాన్ని గుర్తించారు. అలాగే డార్మిటరీ గదులు, టాయ్‌లెట్లు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు దుర్వాసన వస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ కృష్ణమ్మూర్తిని అడిగి పాఠశాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు 8 అంశాలపై తాను గురుకుల పాఠశాల, ఎస్సీబాలికల హాస్టల్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. తన పరిశీలనలో వెల్లడైన విషయాలను కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు నివేదిస్తానన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహ స్వామి ఆలయం సమీపాన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నందికొట్కూర్ మండలం, మండ్లెం గ్రామానికి చెందిన శివ ప్రసాద్ మద్దిలేటి స్వామి దర్శనార్థం ద్విచక్రవాహనంపై వచ్చాడు. స్వామివారి దర్శనం అనంతరం ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు రహదారి ప్రక్కన్న ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. వర ప్రసాద్‌కు తీవ్రగాయాలు కావడంతో బేతంచెర్ల సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం లైఫ్ అంబులెన్సులో కర్నూలుకు తరలిస్తుండగా మార్గ మధ్యలో వరప్రసాద్(35) మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా విక్రయిస్తే క్రిమినల్ కేసులు

నందికొట్కూరు: నాటు సారా విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని నీలిషికారిపేటలో దాడులు నిర్వహించి 150 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నీలిషికారి ఇస్రాం వద్ద ఏడు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్ని కేసు నమోదు చేశారు. అదే పేటలో మరో బృందం నిర్వహించిన దాడుల్లో నాటు సారా విక్రయిస్తున్న సుగాలి కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్వీ రమణ తెలిపారు. బెల్లం ఊటను ధ్వంసం చేసి, ఆరు లీటర్ల నాటు సారా ఎస్ఐ స్వాధీనం చేసుకున్నామన్నారు.

బస్సులో చోరీ

శ్రీశైలం నుంచి కర్నూలు వెళ్తున్న బస్సులో ఈ నెల 4వ తేదీన చోరీ జరిగింది. వివరాలను టౌన్ సీఐ విజయభాస్కర్ శనివారం వెల్లడించారు. శ్రీశైలం డ్యాం వద్ద ఏపీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు కర్నూలు పట్టణంలో ఉంటున్న అక్క నాగమణి గృహ ప్రవేశానికి గురువారం కుటుంబ సభ్యులతో కలిసి బయల్దేరారు. 10 బొల్లవరం గ్రామ పరిధిలో చూసుకోగా బ్యాగు కనిపించపోవడంతో శ్రీనివాసులు అక్కడే బస్సు దిగి, భార్య, పిల్లలను అదే బస్సులో కర్నూలుకు పంపించారు. అనంతరం నందికొట్కూరు పోలీసు స్టేషన్‌కు చేరుకున్ని ఫిర్యాదు చేశాడు. బ్యాగులో 4.5 తులాల బంగారం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీడీ బంకులో చోరీ

మహానంది: మహానంది సమీపంలోని శ్రీనగరం గ్రామంలోని శివారు వద్ద వ్యాపారం నిర్వహించుకుంటున్న తిరుపతయ్య బీడీ బంకులో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బంకు తాళాలు పగలగొట్టి దుకాణంలో ఉన్న సిగరెట్లు, బీడీలు, వస్తువులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు. చోరీ విషయంపై మహానంది పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించాడు.

భర్త, అత్తమామ వేధిస్తున్నారని ఫిర్యాదు

మహానంది: అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్త, మామలు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని గాజులపల్లెకు చెందిన ఆవుల మాధవి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గాజులపల్లెకు చెందిన నాగన్న, మాధవిలకు కొన్నేళ్ల క్రితం వివాహం కాగా, వీరికి కుమార్తె ఉంది. అయితే ఇటీవల భర్త నాగన్నతో పాటు అత్త, మామలు నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారన్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.